


కాఫీ ఇదిగో నండి."

"................"

"ఓయ్! మిమ్మల్నే— —కాఫీ..ఇక్కడ పెట్టనా—"

"... ...ఊ............"

"ఏమిటి ఊ—చల్లారిపోతుంది అనక"

".......ఊ....."

"ఏమండోయ్: ఏమిటా ఊఋ..." అంటూ ఉషభర్త భుజంమీద చెయ్యివేసి కుదిపింది.

"అబ్బ...విసిగించక ఏదో ఒకటి చెయ్యి"

రాజారావు ఆమాట అనేసి మళ్ళా ఆ మరో ప్రపంచంలోకి వెళ్ళిపోయాడు.

ఇది దైనందిన కార్యక్రమమే! అయినా ఇద్దరికే పరగడుపుగానే ఉంటుంది. ఉష మారు మాట్లాడకుండా కాఫీ టేబిలుమీద పెట్టి వంటింటికెళ్ళి పోయింది.

# అమాయకుడు

— 'భూపతి' —

*ప్రేమించాడు. నిజంగానే ప్రేమించాడు. పువ్వుల్లో పెట్టి పూజిస్తున్నాడు. అలాంటప్పుడు "నేను నిన్ను ప్రేమిస్తున్నాను; నువ్వు లేకపోతే బ్రతకలేను" అని చెప్పడం నిరర్థకం కాదా? ఆ మాటకు మూర్ఖత్వమే కాదా? కాని, స్త్రీ హృదయం కోరేది ఏమిటి?*

---

ఒక పావుగంట గడిచింది. ఉష భర్తగదిలోకివచ్చి చూసింది. టేబిలుమీద కాఫీ అఘోరిస్తోంది. ఆమె గిరుక్కున వెనక్కు తిరిగి వచ్చేసింది.

అంతసేపు కాఫీ కూడా తాగకుండా అతగాడు చేసేపని ఏమిటంటే "ఏమీలేదు" అని ఉష తేలిగ్గా అనేస్తుంది.

రాజారావు 'ఎం. ఏ' ప్యాసయి స్థానిక కళాశాలలో లెక్చరరుగా పనిచేస్తున్నాడు. అతను 'పుస్తకాల పురుగు'. ఇంట్లో ఉన్నసమయాల్లో వీశెలు వీశెలు బరువు ఉండే పుస్తకాలు ఛడామడా చదివేస్తుంటాడు. కనీసం భార్యతో అయినా మాట్లాడనంత ఏకాగ్రచిత్తుడు.

అతని కార్యక్రమం ఎరిగి కూడా దానికి వ్యతిరేకంగా నడుచుకోబోవడం, తర్వాత—తప్పు గ్రహించి విభాయించుకోవడం ఆమెకు అలవాటు. ఉష బి. ఏ. సంస్కృతంతో ప్యాసయింది. ఉషా, రాజుల వివాహం—ప్రేమ పర్యవసానం అంటారు వారి గాథలూ కథలూ తెలిసినవారు.

• • •

"........ఉషా! చదువుకున్న ఆడవాళ్ళను పెళ్లి చేసుకోకూడదని నాకు ఒక కోర్కెలాంటిది ఉంది. . ఎందుకంటే వాళ్ళను భరించలేం. కానీ, నీ గుణగణాలను గ్రహించి ఈ సాహసం చేశాను అయినా, నిన్నుచూస్తుంటే నాగుండె నిమిషానికి నూట యాభైసార్లు కొట్టుకుంటోంది చూడు. . మరి నాభయాన్ని తొలిగించి నన్ను ఎలా మచ్చిక చేసుకుంటావో" అని పెళ్లినాటి ప్రథమ సమాగమనంనాడు భర్త అన్నమాటలు ఉషకు గుర్తుకు వచ్చాయి. నిస్పృహతో నిట్టూర్పు. అన్నం వార్చింది.

పెళ్లయిన కొత్తలో అంతా—ఆడపడుచులూ, అత్తమామల మధ్య ఉండడంవల్ల వారానికి ఒకసారి అయినా ఆమెకు భర్తముఖం చూసే సావకాశం చిక్కేది కాదు. దైవం అనుకూలించి అతనికి వేరే దూరంగా ఒక కాలేజిలో లెక్చరరు ఉద్యోగం వచ్చింది. అతనితల్లి—"దాన్నికూడా తీసుకెళ్లి కాపురంపెట్టు—హోటలు కూడు ఏంతింటావు"—అంది. అనాడు ఉష ఆనందానికి అంతులేదు.

గత మధురానుభూతులు ఆమెకు చక్కిలిగింతలు పెట్టాయి. ఉష లోలోన నవ్వుకుంటూ వంటపని చకచకా చేయసాగింది.

". . . ఉషా. .ఒక్కమాట చెప్తాగాని ఏమీ అనుకోవుగదా" అన్నాడు అతను ఒకనాడు. "ఆహా! చెప్పండి" అందామె భర్త క్రాపులోకి వేళ్ళుపోనిస్తూ.

రాజారావు చెప్పడానికి కొంచెం సస్తాయించి ప్రారంభించాడు. .

"చూడు. .ఉషా! నేను చదువుకునేటప్పుడు పరమేశ్వరుడైనా వచ్చి పలుకరిస్తే పళ్లూడగొట్టాలని పిస్తుంది. ఈ విషయం నువ్వు గ్రహించే ఉంటావనుకుంటాను."

ఉష గతుక్కుమని అతను కూర్చున్న కుర్చీ చెయ్యిమీద గమ్మని దిగిపోయింది. రాజారావు ఆమాటలు అనేసి తన పుస్తక ప్రపంచంలో మునిగిపోయాడు. ఉష కండ్లవెంట గిర్రున నీరుతిరిగింది. పైట చెంగుతో కళ్ళు ఒత్తుకొంటూ ఇవతలకు వచ్చేసింది—ఆనాడు.

వంటచేస్తున్న ఆమెకు యీ సంఘటన గుర్తుకు వచ్చేసరికి అనుకోకుండా కళ్లవెంట నీరు తిరిగింది.

• • •

రాజారావు యాంత్రికంగా భోజనంచేసి కారులో కాలేజీకి వెళ్లిపోయాడు. ఉష కాస్త ఎంగిలిపడి బరువెక్కిన హృదయంతో పక్కమీద చేరింది.

..... రాజారావు బి. ఏ. చదివేరోజుల్లో ఆమె ఇంటరు చదువుతుండేది. రాజారావు పార్టులలో ఒకటి సంస్కృతం అవడం, తన గ్రూపు సంస్కృతం అవడం వల్ల అతన్ని కనీసం రోజుకు ఒకసారి అయినా చూస్తూ ఉండేది తప్పక. ఇది అలవాటయిన కొన్నాళ్ళకు అతను ఎప్పుడైనా క్లాసురూములో కనబడకపోతే "ఇతగాడు ఈ రోజు రాలేదెందుకుచెప్మా" అని ఆమె మనస్సులో ఓ మారుమూల ఒకచిన్న ఆలోచన మెదిలేది.

క్లాసులో ఫస్టు మార్కులన్నీ "అతనివే', అని ఉష వాకబుల ఫలితంగా గ్రహించింది. రోజూ ఎవరో ఒకరు అతని గుణగణాలను గూర్చి గరల్సు రూములో ప్రసంగిస్తూనే ఉండేవారు. అలా ప్రసంగిస్తూన్నప్పుడు ఆమె తన చెవులను వీలైనంత పెద్దవి చేసుకొని వినేది. తన క్లాసులో తనకూ అతని లాగానే ఫస్టు మార్కులు రావాలని కష్టపడి చదవడం ప్రారంభించింది.

రాజారావు డిబేటుల్లో, ఉపన్యాసాల్లో పాల్గొంటున్నాడని తెలుసుకొని, అవి తనకు ఇష్టం లేకపోయినా అలవర్చుకుంది. రాను రానూ ఆ డిబేటుల్లో మాట్లాడటం కూడా అలవాటు చేసుకుంది.

సామాన్యంగా రాజారావు పక్షం మాట్లాడే ఉష ఆనాడు ఎందుకో అతనికి వ్యతిరేకంగా మాట్లాడింది. అంతకన్నా ఆశ్చర్యంగా ఆమె నెగ్గింది. అతను ఓడిపోయిన మొట్టమొదటి డిబేటుకూడా అదే అన్నారు జనం. . .

డిబేటుముగిసిన తర్వాత రాజారావు చిరునవ్వుతో ఆమెను సమీపించి, "మీరు కొత్తలోనే ఇంత బాగా మాట్లాడినందుకూ, గెలిచినందుకూ నా అభివందనలు." అనేసి నిఖార్సయిన నూరు వయస్సైనల పెద్ద మనిషిలా వెళ్ళిపోయాడు. ఆ రాత్రి ఆమె పొందిన ఆనందానికి అంతులేదు. ప్రతిసారీ అతనికి ప్రతిపక్షంలో ఉండి వాదించాలని నిశ్చయించుకుంది.

మరోనాటి డిబేటులో ఆమె దురదృష్టవశాత్తూ వోడిపోయింది. ఆనాడు అతని స్నేహితులు "జై రాజా" అని అరుస్తూంటే ఆమెకు ఉక్రోషం ముంచుకువచ్చింది. రాజారావు ఎప్పటిలాగానే ఆమెతో—నవ్వుతూ "మీ రలాగ నిరుత్సాహ పడకూడదు. అపజయం వోటమి ప్రసంగ విషయానికిగానీ, మీకు కాదుగా" అన్నాడు ఆమెను సంతోషపెట్టే ధోరణిలో. కాని ఆమె ముఖం విప్పారలేదు. నీళ్లు తిరిగిన కళ్లతో అతనికేసి చురచురా చూసి, గిరుక్కున తిరిగి, చరచరా ఇవతలకు వచ్చేసింది. రాజారావు నిశ్చేష్టితుడై కాస్సేపు అలాగే ఉండిపోయి భారంగా నిట్టూర్చి తన గదికి చేరుకున్నాడు.

తర్వాత డిబేటులో అతని పేరు కనబడలేదు. ఉష తన తొందరపాటుకు చాలా నొచ్చుకుంది. చాలాసార్లు తనను తను దూషించుకుంది. ఏదోసాకు చెప్పి అనాటి డిబేటుకు తనుకూడా హాజరు కాలేదు.

ఆనాటినుండీ, జరిగిన రెండు మూడు డిబేటులలో ఇద్దరూ పాల్గొనలేదు. అతను ఆమెకు కనపడలేదు! అతన్ని క్షమాపణకోరి మళ్ళీ పాల్గొనమని చెప్పాలని ఆమె అతనికోసం చూసింది.

అనుకోకుండా ఒకనాడు సంస్కృతం గదిలో అతన్ని ఒంటరిగా కలుసుకుంది. ఆమెను చూడగానే అతను తప్పుచేసినవాడిలా చివాలున నిలిచి పుస్తకాలు చేతో పుచ్చుకున్నాడు. ఆమెకు

ఏమని క్షమాపణ చెప్పాలో తెలియలేదు.

"చూడండి!" అందామె నెమ్మదిగా. గడపదాటబోతున్న అతను వెనక్కు తిరిగాడు.

"మీరు ఈ మధ్యన డిబేటులలో "

". . . తీరుబడిలేదండి" అతను ఆమె మాటలను మధ్యలోనే తుంచేశాడు.

"మీరుచెప్పినమాట నిజమేనా?"

ఆమె గొంతు స్థాయి హెచ్చించింది. అతను కొయ్యబారిపోయాడు. తన అధికార స్వరానికి ఆమె ఆశ్చర్యపడిపోయింది.

అతను తల అడ్డంగా వూపి" మిమ్మల్ని కష్టపెట్టడం ఇష్టంలేక" అన్నాడు.

"అయితే నేను మానేశానుగా మీరు చేరండి" అందామె అతనికేసి జాలిగాచూస్తూ.

"వద్దులెండి. నేనొక్కణ్ణే మళ్లాచేరలేను. మీకంత విశాల హృదయం ఉంటే మీరూ చేరండి. లేకపోతే లేదు" అన్నాడతను చేతిలో వున్న పుస్తకాలు సర్దుకుంటూ.

"నేను చేరితే మీరూ చేరతారా?"

"ఆహా తప్పక చేరతాను" అతను నవ్వుతూ జవాబిచ్చాడు. ఆ నవ్వుతో ఆమె శ్రుతికలిపింది.

ఇలా కలిసిన సంబంధం నానాటికీ, బంధమై చివరికి 'ప్రేమపాశం' అయిపోయింది. . . .

. . .ఉష పక్కమీంచి లేచి గడియారం వంకచూసింది. గడియారం టంగున ఒంటి గంట కొట్టింది. ఆమె పడకకుర్చీలో కూర్చుని పత్రిక చేత్తోపుచ్చుకుని చదవ బోయింది కానీ ఆమె మనస్సు గతంలోకి లాగింది.

. . . . .అది ఆ సంవత్సరానికి ఆఖరుడిబేటు. 'రాజు బి. ఏ. పూర్తయ్యాక ఏం చేస్తాడో, అనుకుంది ఆమె. ఆనాటి డిబేటులో అతనే నెగ్గాడు. ఆమె ఎంతో ఆనందించింది.

"ఇదే ఆఖరి డిబేటనీ, పోతున్నాడుగదా ఎందుకు ఏడిపించాలనీ, మీరు కావాలనీ ఓడిపోయినట్లున్నారు?" అన్నాడు రాజారావు చిరునవ్వుతో. ఆ నవ్వే—ఆ నవ్వు— ఆమె హృదయంలోపలి వీణను—శ్రుతిచేసి 'టుంయ్' మని మీటింది. ఆమె ఆనందంతో ఉబ్బిపోయి "లేదండీ" అంది నవ్వును దాచుకోడానికి ప్రయత్నిస్తూ.

"ఆ. .ఇక మనకు పరీక్షలు. మళ్లీ కలవం, చక్కగా చదవండి." అన్నా డతను ఆమెను హెచ్చరిస్తున్నట్లు.

"మీరు—పై చదువుకువెళ్తే—మా డిబేటు, మేము గుర్తుంటామా?" ఆమె ప్రశ్నించి కళ్లు కొంటెగా తిప్పింది.

"గుర్తుంచుకో వలసిన విషయాన్ని మర్చిపోయే అంత మూర్ఖుణ్ణిగాను" అన్నాడతను హుందాగా.

ఉష అతని వాక్చాతుర్యానికి అబ్బురపడింది.

"నేను—బి. ఏ. కూడా ఇక్కడే చదువుతాను. ఎప్పుడైనా మావూరువస్తే, మేము

# అమాయకుడు

గుర్తుంటే—వీలుంటే, శ్రమ అనుకోకపోతే కనిపిస్తారుగా" అందామె చుట్టూచూచి ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుంటూ.

"ఎక్కడ కనిపించమంటారు? ఇక్కడా?? లేక ఇంటిదగ్గరా! ఇంటికొస్తే తన్నించి తగలెయ్యరుకదా?" అన్నాడతను నవ్వుతూ.

"అబ్బ. .మీరు రావాలేగాని,. . .తన్నించుతాం అంటారా. .ఎంతమాట అన్నారు" అందామె ఆపదాలకు దండాన్వయం తెలియక.

"మాటవరసకు సరదాకు అన్నాను లెండి"!

"ఇంటికిరాగలిగితే ఇంకా సంతోషం" అంటూ ఉష ఒక కాగితంమీద తన అడ్రసు రాసి అతనిచేతికి ఇస్తూ "వస్తారుగా" అంది.

"చూస్తారుగా" అన్నాడతను ముక్తసరిగా.

కానీ ఆమె బి. ఏ. చదివిన రెండు సంవత్సరాల్లోనూ, మాటవరసకన్నా ఒక్కసారి రాలేదు, కనపడలేదు కూడా.

అతని ప్రవర్తన ఆమెకు అంతుపట్టలేదు. బి. ఏ. అయిపోయిన తర్వాత తండ్రి ఆమెకు సంబంధాలు చూడడం ప్రారంభించాడు.

గతాన్ని తలుచుకొని ఉష రోజూ అర్ధరాత్రి అలారం పెట్టుకున్నదానిలా, లేచి వలవలా విలపించింది.

ప్రేమ కథల్లోలాగ. .మచ్చిక అయిన మూడో ఘడియకు. . . మీరునన్ను 'అండి' అని పిలవద్దు. నా పేరు 'ఉష'. పేరుపెట్టి పిలవండి అంటే బాగుండేది. తర్వాత మిమ్మల్ని మనసారా ప్రేమించాను అని చెప్పేస్తే బావుంటుంది. మనపెళ్లి మాట ఏం చేశారు? అని అడిగేస్తే బావుండేది. ." అని ఆమె మనస్సు శ్రుతి చెడిపోయిన 'హృదయ వీణ'ను శ్రుతిచేస్తూ సలహా ఇచ్చింది.

"ఛీ ఛీ..అలాంటివి నాకు గిట్టవు" అంది ఆమె.

అసలతన్ని ప్రేమిస్తున్నట్లు, తెలుసుకున్నాడో, లేదో, ఇంకా అవివాహితుడుగా ఉన్నాడో—లేక. . .

ఆమాట తలుచుకునే సరికి ఆమె గుండె ఝల్లుమంది.

మనస్సులో అనుకున్న ప్రకారం ఆమె తండ్రి తెచ్చిన ఆక్షేపణలేని విక్షేపంలాంటి మూడు సంబంధాలు తిరుగ గొట్టేసింది. కానీ ఆమె తండ్రి విసుగు లేకుండా మళ్లీ తన పనిలో మునిగి పోయాడు. ఆయన తెచ్చిన నాలుగో సంబంధమే రాజారావు. అతను తన పేరు రమణారావు అని చెప్పుకొన్నాడు.

పెళ్లి చూపుల్లో అతన్ని చూచిన ఆమె మనస్సు లేడిపిల్లలా, ఆవుదూడలాగాగంతులు వేసింది. అతను ఆమెకేసి చిలిపిగా చూశాడు.

పెళ్లి అయిపోయింది.

ఆనాటిరాత్రి. ."ఉషా..నామీద కోపం వచ్చిందా?నేనొస్తానని రాలేదుకదూ, అంతేనా? పరాయి ఆడపిల్లలింటికి పదే పదే తిరగడం నాకు ఇష్టంలేక రాలేదు. ఇప్పుడు చూడు నీచుట్టూ, మీయింటిచుట్టూ ఎన్నిసార్లు అయినా తిరుగుతాను" అన్నాడతను ఆమె నడుంచుట్టూచెయ్యివేసి దగ్గరగాలాక్కుంటూ.

........ఉష కుర్చీలోంచి లేచి పత్రిక టేబులుమీద పారేసి మంచం మీద చేరింది. భర్త నడవడి, అతని మాటలు, వాటిలో ఆమెకు ఆప్యాయత ఏనాడూ కనుపించలేదు—మంచం మీద పడుకుని మళ్లీ ఆలోచనలో మునిగి పోయింది. . . .

. . .అది అర్ధరాత్రి—గడియారం పన్నెండు గంటలు కొట్టింది. రాజారావు భార్యను తట్టి లేపాడు. అతనప్పుడే చదువు ముగించి పక్క మీదకు చేరాడు. "ఏమండీ" అందామె కళ్లు నలుపుకుంటూ.

"ఉషా...పొద్దున్న కంద కూర చాలా బావుందిస్మీ" అని దుప్పటి ముసుగుపెట్టుకుని నిద్రలోకి చొచ్చుకపోయాడు.

ఆ మాటలు విన్న ఆమెకు నవ్వాలో, ఏడవాలో తెలియలేదు.

అలాగే మరోనాడు కారు గ్యారేజిలోంచి తీస్తూ—"ఓయ్, రాత్రి వంకాయకూర, పొద్దున్న బండపచ్చడి—బ్రహ్మాండంగా ఉన్నాయి సుమీ—" అనేసి బాకీ తీర్చుకున్నట్లు వెళ్ళిపోయాడు.

ఈ మాటలు 'ఆపమయాల్లో' అనడానికి అతనికి అవకాశం ఉండదు. టైము వృథా అయితే అతను సహించలేడు. జంటతనంలో ఉన్న అతను జంటతనంలోకన్నా ఒంటరితనం లోనే ఎక్కువ ఆనందం అనుభవిస్తాడు. అతనికి పుస్తకాలే పుస్తె.

ఒకనాడామె తనమనోరథాన్ని అతనితో నివేదించుకుంది. రాజారావు బుర్రగోక్కున్నాడు.

"ఉషా! ఏమిటా పిచ్చిమాటలు, నీకేం తక్కువ చెప్పు? చక్కని ఇల్లు కొనుక్కున్నాం—కారు కొనుక్కున్నాం. రెండు చేతులా సంపాదిస్తున్నాను. నేను నెలకు మూడు చీరలు కొంటున్నాను. నీకు కాలక్షేపం కావాలంటే సినిమాకు వెళ్ళు. పొరుగింటివాళ్లను మంచి చేసుకో. కావలసినంత కాలక్షేపం అవుతుంది" అన్నాడు.

ఆనాటి రాత్రి ఆమె పక్కంతా చెరువు అయ్యేలా ఏడ్చింది.

"ఒక స్త్రీ తన భర్త దగ్గర్నుంచి పొందేవి, పొందకోరేవి—డబ్బూ, నగలూ, బట్టలూనా?— ఛీ—ఛీ—పాపిష్టిడబ్బు—ఎందుకు? ఆదరణ లేని డబ్బు—పని దానికి ఇచ్చినట్లు—ఆదరణ లేని ఆ ఆనందం ఎందుకు తగలెయ్యనా"

అంటూ ఆమె కంటికి, మింటికి ఏకధారగా ఏడిచింది.

"వివాహం అన్నపదానికి సరిఅయిన అర్థం ఆయనకు తెలీదేమో" అనుకుంది చివరికి.

• • •

గడియారం అయిదు గంటలు కొట్టింది. వీధిలో కారు ఆగిన చప్పుడూ, వెనువెంట బూట్ల టకటకలూ వినిపించాయి. రాజారావు చేతిలో పార్సెలుతో భార్యను సమీపించాడు.

"ఉషా, చూశావ్—మార్కెట్టులోకి కొత్త రకం చీరలు వచ్చాయి. ముందు నేనే కొన్నాను" అంటూ అతను పార్సెలు విప్పి టేబులుమీద పెట్టి కుర్చీలో కూర్చున్నాడు.

ఆమె భర్తకేసి జాలిగా చూసింది.

"ఏమండీ, నాకు కావలసినవి యీ చీరలే అని నే నెప్పుడయినా అన్నానా ?" అందామె అతని పక్కన నించుని కాలరు సరిచేస్తూ.

"మరేమి కావాలి" అన్నాడతను అర్థం కాని విద్యార్థిలా ముఖం పెట్టి.

"మీ ప్రేమ" అందామె అతని టై సవరిస్తూ.

"నా ప్రేమను ఇంకా ఎలా చూపించను?" అన్నాడు రాజారావు టేబులు మీదున్న చీరలు చూపిస్తూ.

"మీరు కులాసాగా నాతో ఒక్క నిమిషం అయినా మాట్లాడితే అదే చాలు" అందామె ప్రాధేయ పడుతున్నట్లు.

రాజారావు కదలబారేడు."ఉషా ! ఇలాంటి పిచ్చి సిద్ధాంతాలు పెట్టుకోక. చదువుకున్న దానివికదా ? మనిషికి ఉన్నది పుష్టి, గొడ్డుకు తిన్నది పుష్టి అన్నారు పెద్దలు తెలుసా ? సంపాదించగలిగిన రోజుల్లో సంపాదిస్తే సంపాదించలేని కాలంలో అది ఖర్చు పెట్టుకోవచ్చు తెలుసా?" అన్నాడు ఆమె గాజులు సవరిస్తూ.

అతని మాటలు ఆమెకు చెరుకు పిప్పిలా చప్పగా ఉన్నాయి. కానీ, అతని మనస్సు బాధ పెట్టడం ఇష్టంలేక "అలాగేలెండి" అంది లేని నవ్వు ముఖంమీద తెచ్చిపెట్టుకుంటూ.

• • •

ఆవేళ అతను కాలేజీనుంచి పెందలాడే ఇంటికి వచ్చాడు. చేతిలో కొన్ని పుస్తకాలున్నాయి. ఆ పుస్తకాలు భార్యకు చూపిస్తూ, "చూశావా, పిల్లా, ఈ పుస్తకాలు నేను రాశాను. ఇవిగో ఈ గైడులు నేను రాశాను..." అంటూ ఒక్కొక్కటే చూపించసాగాడు. ఆ సమయంలో ఆమెకు భర్త ఆనందం లక్కపిడతలతో ఆడుకుంటూ ఆనందిస్తున్న చంటిపిల్లాడి ఆనందంలా కనిపించింది.

నాటి రాత్రి ఆమె భర్త పక్కన మాట్లాడి తన మనోభావాన్ని మార్చుకోవాలని విఫల ప్రయత్నం చేసింది.

"ఎంతైనామటుకు భార్యతో సంతోషంగా అయినా మాట్లాడకుండా ఏదో పని అని దేవుళ్లాడితే ఇంట్లో తనకోసం కనిపెట్టుకుని, తననే నమ్ముకున్న ప్రాణి ఉసూరు మూర్పిందేనా?" అందామె మనస్సు.

• • •

ఆవేళ రోజులా అతను కాలేజీనుండి తిరిగి రాలేదు. ఆ రాత్రంతా ఆమె భయాందోళనలతో కాలం గడిపింది. తెల్లవారుతూనే వచ్చాడు రాజారావు. వస్తూనే "ఉషా, కోపం వచ్చిందా... ప్రెస్సులో పని ఎక్కువగా ఉండి అక్కడికి క్యారేజి తెప్పించుకుని భోజనం చేశాను" అన్నాడు.

ఉష కోపం పట్టలేక పోయింది. "పోనీ ఇదే హొటలనుకుని ఇక్కడనుంచే క్యారేజీ పట్టుకుని వెళ్లకబోయారా" అం దామె కసిగా.

"ఇదే హొటలు అనుకుంటే మరోటి ఇల్లనుకుని ఎక్కడో ఉండవలసి వస్తుంది."

ఉష ఆ మాటలు విని ఉలిక్కిపడింది. భర్త ముఖంకేసి చూసింది. అతను ఏదో పుస్తకం చూస్తున్నాడు.

ఆ రాత్రంతా ఆ మాటలే ఆమెను బాధించాయి. పరాయి స్త్రీని తన భర్త బాహువుల్లో వూహించుకుని నరకయాతన పడిపోయింది.

రాజారావు పన్నెండు గంటలయినా ఏదో పుస్తకం చదువుతూనే ఉన్నాడు. ఉష అశ్రువులు నిండిన కంటితో అతనికేసి చూస్తూ పడుకుంది.

"నన్ను ఎందు కిలా అన్యాయం చేస్తారు ? నేనేం చేశాను? మీరు ఎందుకిలా నాకు అన్యాయం చేస్తున్నారు" అని అడిగేద్దామని నిర్ణయించుకుంది. గడియారంటంగున ఒంటిగంటకొట్టింది. రాజారావు పుస్తకం చదవడం ముగించి, బెడ్ లైట్‌వేసి, పెద్ద లైటు ఆర్పేసి మంచం దగ్గర కొచ్చి "అప్పుడే నిద్రపోయారే, అమ్మాయి గారు?" అన్నాడు. దాగిన ఆమె దుఃఖం గండి పడిన చెరువునీరులా ప్రవహించింది. వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది.

రాజారావు కొయ్యబారి పోయాడు. అతను 'కాపురం' పెట్టిన తర్వాత ఆమె కంట తడి ఎప్పుడూ చూడలేదు. వెక్కి వెక్కి ఏడ్వగా అసలే చూడలేదు.

"నేనేం చేశానని, నన్నన్యాయం చేస్తారు" అంది ఉష వెక్కి వెక్కి ఏడుస్తూ.

రాజారావు బుర్ర గోక్కున్నాడు. అతని ముఖంమీద చిరునవ్వు వెలిసింది.

"ఏం ? ఏమైనా పీడకల వచ్చిందా? నాతో చెప్పవూ?" అంటూ ఆమెను తనవైపు లాక్కున్నాడు.

ఉష వెక్కి వెక్కి ఏడుస్తూ 'ఆ కథ' అంతా చెప్పింది. రాజారావు నిశ్చేష్టు డయ్యాడు.

"ఉషా ! ఇలా నువ్వు అనుమాన పడ్డావంటే నామీద నాకే అనుమానం వేస్తోంది. దేవుడు సాక్షిగా నేను అలాటి, ఏలాటి పాపం ఎరుగను" అన్నాడు. అతని కంఠం బొంగురు పోయింది



ఉష భర్త సాత్వికుడని, అమాయకుడనీ నమ్మింది. ఆ రాత్రి ఆమెకు మరపురాని మధురానుభూతి అయింది.

• • •

ఆవేళ శనివారం. రాజారావు కాలేజీకి వెళ్లతూ "సాయంత్రం — సినిమాకు వెళ్దాం కాని సిద్ధంగావుండేం" అన్నాడు. ఆమె ఆ మాటలకు మురిసిపోయింది.

సాయంత్రం అయింది. ఉష చక్కగా సింగారించుకుని సావిట్లో కూర్చుంది.

గడియారం ఆరు కొట్టింది.

ఏడు....

ఎనిమిది....

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ పక్కమీద పడుకుంది. ఆ రాత్రంతా ఆమె ఏడుపుతోనే గడిపింది. రాజారావు ఆ రాత్రి ఇంటికి రాలేదు. మర్నాడు మధ్యాహ్నానికల్లా వచ్చాడు. వస్తూనే "చూశావా, మనం ప్రోగ్రాం వేసుకున్నామా? నేను బయల్దేరబోతుండగా ఒక స్నేహితుడు వచ్చి అతని భార్య ప్రసవించే సమయమని టెలిగ్రాం వచ్చిందని, ట్రైలు తప్పిపోయిందని చెప్పాడు. పోనీలే అని కారులో అతన్ని దించి వచ్చేసరికి ఈవేళ అయింది" అన్నాడు.

అతని మాటల్లో అసత్యాన్ని అన్వేషిస్తూ ఆమె అతనికేసి చూసింది. అతను చక్కగా, కులాసాగా కలకలలాడుతూ నవ్వుతున్నాడు.

"పోనీలెండి....మరో రోజు వెళ్లొచ్చు" అందామె భర్తను సంతోషపరిచే ధోరణిలో రాజారావు భార్య మాటలకు ఆనందించాడు

• • •

"బాబోయ్! నిజమే" అన్నాడు రాజారావు ఉలిక్కిపడి. "ఔనం" దామె సిగ్గుతో రెండు చేతుల్లో ముఖం దాచుకుంటూ.

"ఎన్నో నెల?" అన్నాడు.

'మూడు' అని ఆమె మూడు వేళ్లు చూపించింది.

అతను కాస్సేపు ఆలోచించి ప్రారంభించాడు: "చూడు పిల్లా, మనకు మగపిల్లాడు పుడతాడనుకో, వాణ్ణి డాక్టరు చేయించాలి, అంటే ఎంతో ఖర్చైన చదువన్న మాట. నెలకు

రెండు వందలైనా వాడికి ఖర్చు వుంటుంది. కనుక నేను కొంచెం నా సంపాదన ఎక్కువచేసుకోవాలి'' అన్నాడు వేళ్ళు లెక్కపెడుతూ.

పుట్టబోయే పిల్లవాడి పెద్ద చదువుకు అయ్యే ఖర్చు లెక్కవేయబోతున్న అతన్ని చూచి నవ్వాలో, ఏడవాలో ఆమెకు అర్థంకాలేదు.

అనుకున్న ప్రకారం రాజారావు తన సంపాదన ఎక్కువ చేశాడు. కొన్ని ప్రైవేట్లు చెప్పడం ప్రారంభించాడు. మూడు నెలలు తిరిగేసరికి మూడు రోజులు మూసిన కన్ను తెరవనంత జ్వరం వచ్చింది. ఉష మొక్కని దైవం లేదు. ఆమె అతన్ని అంటిపెట్టుకొని ఉన్నది. ఆరో నాటికి అతనికి ఆరోగ్యం చిక్కింది.

"చూడండి ఎందుకింత తాపత్రయం? మనకేం లేదా పోదా? అనవసరంగా శ్రమపడి వున్న ఆరోగ్యాన్ని పోగొట్టుకోకండి మీరు. మనకున్న డబ్బు ఎక్కీ, తొక్కీ అవుతుంది. ఉన్నది చాలు'' అందామె ఆందోళనాపూరితమైన కంఠంతో.

రాజారావు చిన్నగా నవ్వాడు. "చూడు ఉషా... ఆస్తిఅంతా మానాన్నగారు నాకు యిచ్చినది. దాన్ని చెక్కుచెదరకుండా మన పిల్లలకు యివ్వాలి. వాళ్ల చదువులకూ, వాళ్ల ముచ్చట్లకూ, మన ముచ్చట్లకూ అది ఖర్చుపెట్టడం నా అభిమతం గాదు... పైగా మనిషై పుట్టిన తర్వాత వీలైనన్ని మార్గాల్లో డబ్బు సంపాదించాలి. ఆ మార్గాలు నీచమార్గాలూ, ద్రోహ మార్గాలూ కానినాడు ఏ హానీ లేదు. వీలైనంత ఖర్చు చెయ్యాలి. ... ఏం.... నేను పిసినారివాణ్ణనా నీ ఉద్దేశ్యం?' అన్నాడు ఆమె ముంగురుల్ని సవరిస్తూ.

"నిజమే!! అతను పిసినారి కాదు. ఖర్చుకు ఎన్నడూ వెనకాడ లేదు'' అనుకుంది ఆమె మనస్సు.

* * *

ఆమెకు ఏడోమాసం వెళ్ళగానే ఆమె తలిదండ్రులు వచ్చి రమ్మని బలవంతం చేశారు.

"వెళ్ళిరా ఉషా....మొన్న వారు వచ్చినపుడు రానన్నావు. ఈసారి వెళ్ళకుండా ఉండకూడదు, వెళ్ళు'' అన్నాడు రాజారావు.

ఉష బట్టలు సర్దుకోవడం ప్రారంభించింది. రాజారావు కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు.

పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ ఆమె భర్త పాదాలకు నమస్కరించి చంటిపిల్లలా వెక్కివెక్కి ఏడ్చింది.

"తప్పు. ఏమి చాదస్తం.... గర్భిణీస్త్రీలు ఏడుస్తే ఆడపిల్లలు పుడతారు. మన ప్లానంతా పాడైపోతుంది'' అన్నాడు అతను నవ్వుతూ ఆమెను లేవదీస్తూ.

"మీ ఆరోగ్యం అసలే సరిగాలేదు. సంపాదన, సంపాదన అంటూ ఆరోగ్యం పాడుచేసుకోకండి.

## అమాయకుడు

మనకు పుట్టబోయే పిల్లలు మనకున్నంతలోనే చదువుకుంటారు. లేకపోతే లేదు'' అందామె ఆవేశంతో.

"వెర్రిపిల్లా....మనం చేయగలిగిం దేదైనా ఉంటే మన పిల్లలకు మంచి భవిష్యత్తు కలగజెయ్యడమే! చూడు మా నాన్నగారు నన్ను ఎం.ఏ., చదివించారు, నా వాటా ఆస్తి నాకు యిచ్చారు కదా, నేనూ అలా చెయ్యద్దూ'' అన్నాడతను నవ్వుతూ.

ఆమె కన్నీరు తుడుచుకొని అతని పాదాలకు నమస్కరిస్తూ "స్త్రీకి కాన్పు పునర్జన్మ అంటారు. నన్ను ఆశీర్వదించండి'' అంది. అతను ఆమె తల నిమురుతూ ధైర్యం చెప్పాడు.

"ఉషా—అధైర్యపడక—కలియుగంలో ధైర్యవంతుని జోలికి రావడం భగవంతునికి కూడా భయమే! తెలుసా!'' అన్నాడు నవ్వుతూ.

* * *

రాజారావుకు ఒంటరితనంలో ఒంటరితనం, అందులో బాధా కొట్టినట్టు కనుపించసాగినవి. నెలపైన గడిచినా అతను హోటలు తిండికి అలవాటుపడలేకపోయాడు.

"ఛీ....వెధవ హోటలు'' అని ఛడా మడా చాలాసార్లు తిట్టుకున్నాడు. "ఉష ఉంటే కాఫీ యిదిగోనండీ, భోజనానికి లేవండీ అని లాలనగా పిలిచేది. ఈ పని వెధవలకు ఏంపట్టింది? నేను భోజనం చేస్తే వాళ్లకేం, చెయ్యకపోతే వాళ్లకేం?'' అని అనుకున్నాడు, బాధపడ్డాడు, తిట్టుకున్నాడు కూడా.

అతను యాంత్రికంగా మరికొన్ని రోజులు గడిపాడు. ఉష వెళ్లి కొన్ని సంవత్సరాలైనట్లు అనిపించిందతనికి.

* * *

ఆవేళ కాలేజీలో యింటర్వల్ సమయంలో లెక్చరర్లందరూ, కుచ్చాటప్పాలు చెప్పుకుంటున్నారు.

"చూశావూ, జగన్నాధం భార్య పోయిందట'' అందొక కంఠం ముక్తసరిగా.

"ఏం? ఎలా?? ఎప్పుడు??'' అన్నాయి ఓ పుంజీడు కంఠాలు.

"కాన్పోయ్! కాన్పు.... ప్రసవ సమయంలో పోయిందట... అసలే ఆ పిల్ల అర్భకురాలు.

పక్కనే కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్న రాజారావు అదిరిపోయాడు. చేతిలోపుస్తకం గిరాటువేసి—వడివడిగా కారుకేసి పరుగెత్తాడు. కారు స్టార్టుచేసి రోజులు లెక్క పెట్టాడు. "అమ్మో! ఉష— ప్రసవమయ్యే రోజులు'' అనుకున్నాడు.

లెక్చరర్ల సంభాషణ చెవుల్లో రింగుమంది. భార్య పుట్టింటికి వెళుతూ, "కాన్పు ఆడదానికి పునర్జన్మ'' అని అన్న మాటలు గుర్తుకువచ్చాయి. గుండెఝల్లు మంది.

మెదడులో—నవ్వుతూన్న ఉష ప్రతిబింబం తళుక్కుమని విద్యుల్లతలా మెరిసింది—అబ్బా అంటూ అతను కనుబొమ్మలు చిట్లించి ముఖం బాధగా పెట్టాడు.

* * *

కారు ఆపి, లోపలకు అడుగుపెట్టే సరికి యిల్లంతా నిశ్శబ్దంగాఉంది. అతనివళ్ళు ఝల్లుమంది. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ గదివైపు వెళ్ళాడు.

"అమ్మా! వారికి టెలిగ్రాం యిచ్చారా, నేను చచ్చిపోతానేమో అని భయంగా వుంది'' అంటున్న ఉష కంఠం అతనికి వినబడింది.

"వచ్చేశాను'' అంటూ ఎగిరి గదిలోకి దూకాడు. ఉషకళ్ళు మిలమిల్లాడాయి. ఆమె తల్లి గమ్మున లేచి నుంచుంది.

అప్పుడే లోపలకు మంత్రసానితో సహా వస్తున్న మామగారు, "అరే—ఎప్పుడొచ్చావోయ్—టెలిగ్రాం ఎప్పుడు అందింది ఎప్పుడొచ్చావు''; అన్నాడు ఆశ్చర్యంతో.

"అందలేదు. నేనే వచ్చాను'' అన్నాడతను.

మామా, అల్లుళ్ళిద్దరూ బయటికి నడిచారు. మామగారు కాలుకాలిన పిల్లిలా బయట పచార్లు ప్రారంభించాడు. రాజారావు కుర్చీలో కూర్చుని భగవన్నామ స్మరణ ప్రారంభించాడు.

"ఓ! భగవంతుడా, ఏడుకొండల వాసా! దానికి యీగండం గడుస్తే నేను జన్మ శనివారాలు ఉంటాను. నీ కొండకు నడిచివస్తాను. తలనీలాలు యిస్తాను. హుండీలో మొక్కులు వేస్తాను. అది చేస్తాను, ఇది చేస్తాను'' అని మొక్కేశాడు.

"మగ పిల్లాడండోయ్'' అంది అత్తగారు యివతలకు వచ్చి.

ఆనందంతో రాజారావు ఎగిరి గంతేసి ఎదురుగుండా ఉన్న మామ గార్ని వాటేసుకొని, అంతలోనే తప్పు గ్రహించి నాలుక కరుచుకున్నాడు.

మామా అల్లుళ్లిద్దరూ లోపలకు వెళ్లారు. కొడుకునూ, భార్యనూ చూసి రాజారావు ఆనందంలో మునిగిపోయాడు.

తర్వాత అత్త మామలు ఆ గదిలోలేకుండా చూసి, "ఉషా ఈ గండం నీకు గడిస్తే, దేముడికి ఏడుకొండల వాడికి జన్మ శనివారాలుంటాననీ, తలనీలాలు ఇస్తాననీ, నడిచి కొండ ఎక్కుతాననీ, మొక్కాను తెలుసా'' అన్నాడు క్రాపులేపుకుంటూ.

ఆమె అతనికేసి చూచి నీరసంగా నవ్వింది.

"ఉషా—మనకు ఈ ఒక్క మగపిల్లాడూ చాలులే...'' అన్నాడు తను కొడుకును ముద్దెట్టుకుంటూ.

ఆమె అతని అమాయకతకు ఆనందించింది. అతని ప్రతిరూపమయిన కొడుకును చూచుకొని మురిసిపోయింది ★